# 10న భారత్ బంద్

## 28 మంది ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టుల పిలుపు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 31: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యంలో ఇటీవల జరిగిన 28 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌కు నిరసనగా జూన్ 10వ తేదీన భారత్ బంద్‌కు పిలుపునిస్తూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరిట శనివారం ఒక లేఖ విడుదలైంది. మే 21న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు అలియాస్ బీఆర్ దాదాతోపాటు 27 మంది క్యాడర్ ఉన్న మావోయిస్టులు మృతిచెందిన విషయం విదితమే. పోలీస్ అధికారులు 27 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించగా, మావోయిస్టులు మరో కామ్రేడ్ కూడా మృతిచెందినట్లు ఎన్‌కౌంటర్ అనంతరం విడుదల చేసిన లేఖలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా.. ఈ ఎన్‌కౌంటర్‌కు నిరసనగా జూన్ 10న భారత్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 11వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు అమరులైన మావోయిస్టుల స్మారక సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండు నెలలుగా మావోయిస్టు పార్టీ సభ్యులందరూ సంయమనం పాటించారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఫాసిస్టు వైఖరికి నిరసనగా బంద్‌కు పిలుపునిచ్చినట్లు పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలకు పరామర్శ


సమ్మయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న రేగా

కరకగూడెం, మే 31: మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన దొంగరి సత్యనారాయణ(70) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు శనివారం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం నింపారు. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన పోలెబోయిన ఎర్రసమ్మయ్య దశదిన కర్మకు హాజరై బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. సమ్మయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో మండల అధ్యక్షుడు రావుల సోమయ్య, మాజీ సర్పంచ్ పాపమ్మ, అత్తె నాగేశ్వరరావు,అంజయ్య, వరప్రసాద్, గుడ్ల రంజిత్ కుమార్, నాయకులు ఉన్నారు.

## బీఆర్ఎస్ బీమా చెక్కు అందజేత


బీమా చెక్కు అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

దుమ్ముగూడెం, మే 31: బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొంది ప్రమాదవశాత్తు మరణించిన పార్టీ సభ్యుని కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం బీమా చెక్కు అందజేశారు. లక్ష్మీనగరం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ పిట్టా వీర్రాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా బీఆర్ఎస్ పార్టీలో సభ్యతం ఉండడంతో సభ్యత్వ బీమా రూ.2లక్షలు మంజూరవ్వగా ఆ చెక్కును మాజీ ఎంపీపీ రేసు లక్ష్మి మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. కణితి రాముడు, ఎండీ.జానీపాషా, తునికి కామేష్, దామెర్ల శ్రీనివాస్, తంతరపల్లి వెంకటేశ్వర్లు, మడకం భూపతి, లంకా శివ, వాగే కృష్ణ, జంగిటి రాము, నిమ్మనగొట్టి రవి, ఆకుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## రిటైర్డ్ పోలీస్ అధికారులకు సత్కారం


రిటైర్డ్ పోలీస్ అధికారులతో ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 31 : సుదీర్ఘకాలంగా పోలీస్‌శాఖలో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించి ఉద్యోగ విరమణ పొందిన అధికారులను ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు శనివారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా సత్కరించారు. కొత్తగూడెం టూటౌన్ ఎస్సై సెల్వరాజు, త్రీ టౌన్ ఎస్సై మస్తాన్‌రావు, అశ్వారావుపేట ఏఎస్సై వెంకటేశ్వర్లు, కొత్తగూడెం టూటౌన్ ఏఎస్సై ఎస్తేర్‌రాణి, బూర్గంపాడు ఏఎస్సై నారాయణరావు, చండ్రుగొండ హెడ్ కానిస్టేబుల్ మధుసూదర్‌రావులు ఉద్యోగ విరమణ పొందారు. డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లయ్య స్వామి, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ లైన్ ప్రారంభం

దమ్మపేట, మే 31: మండలంలోని గంగారం 132 కేవీ సబ్‌స్టేషన్ నుంచి నాచారం 33 కేవీ సబ్ స్టేషన్ వరకు నూతన 33 కేవీ లైన్‌ను శనివారం విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ మహేందర్ ప్రారంభించారు. అధికారులు రాజేష్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
Classifieds

WANTED

★Staff for reputed Homeopathy Clinic, Khammam. Homeopathy Doctors (BHMS/MD) -2, Receptionist (any Degree)-2, Manager-1, Cont: 9502755595
KMM-

★AN Infra DVLP సంస్థలో పని చేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్స్ కావలెను. యాదాద్రి సమీపంలో వెంచర్లకు @ రాక్‌టౌన్ కాలనీ, అలకాపురి, L.B.Nagar, హైదరాబాద్. సంప్ర: 9989747788.
NT-325337-All

అతి తక్కువ ఖర్చు
అత్యధిక ప్రచారం

FINANCE

★Project Finance... MSME, CGTSME, Seed Funding, Private Equity, Venture Capital, Laisoning Services @ KPHB. 7032631468.
NT-350515-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# నీరుంటే చాలు.. లాభాలే లాభాలు..!

**ప్రకృతి వైపరీత్యాల బెడదే ఉండదు**
**కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు**
**కామారెడ్డి రైతులతో ఆయిల్ పాం సాగుదారులు**


పామాయిల్ తోటను పరిశీలిస్తున్న కామారెడ్డి రైతులు

దమ్మపేట రూరల్, మే 31: ‘‘ప్రకృతి వైపరీత్యాల భయం లేని సాగంటూ ఉన్నదంటే.. అది, ఆయిల్ పాం మాత్రమే. దీని సాగుకు నీరు ఉంటే చాలు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే.. ఈ సాగును మించినది మరోటి ఉండదు. లాభాలు దండిగా ఉంటాయి’’ అని, కామారెడ్డి రైతులతో దమ్మపేట ఆయిల్ పాం సాగుదారులు చెప్పారు. దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లోని ఆయిల్ పాం తోటలను, అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీని కామారెడ్డి రైతులు సుమారు 150 మంది శనివారం పరిశీలించారు. వారు మూడు బస్సుల్లో ఇక్కడకు వచ్చారు. ఆయిల్ పాం సాగుపై వారికి ఇక్కడి రైతులు పూర్తి అవగాహన కల్పించారు. మొక్కలు నాటిన మూడేళ్ల వరకు వాటి గుణగణాలను పరిశీలిస్తూ ఉండాలని, నిపుణులకు తరచూ చూపిస్తుండాలని చెప్పారు. జన్యుపరమైన లోపాలు (హాఫ్ టైప్ మొక్కలు) ఎదురవుతాయని, దీనిని అధిగమించాల్సి ఉంటుందని చెప్పారు. ఆయిల్ పాం సాగుకు ప్రధానంగా కావాల్సింది నీరేనని చెప్పారు. రైతులు తమ అనుమానాలను నివృత్తి చేసుకున్నారు. ఆయిల్ పాం మొక్కల పెంపకం, ప్రభుత్వం ఇచ్చే రాయతీలు తదితరాంశాలను ఆయిల్‌ఫెడ్ ఇన్‌చార్జ్ డివిజినల్ అధికారి రాధాకృష్ణ వివరించారు. ఆయిల్ పాం సాగులో చీడపీడల బెడద అతి తక్కుగా మాత్రమే ఉంటుందన్నారు. ఆయిల్‌ఫెడ్ విశ్రాంత డివిజినల్ మేనేజర్/హిందుస్థాన్ యూనీలివర్ ప్రతినిధి అశోక్, ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్లు సతీష్, ఫణి పాల్గొన్నారు.

# పొగాకు.. పాడాకు


కొత్తగూడెం టౌన్: మాట్లాడుతున్న జడ్జి సరిత

కొత్తగూడెం టౌన్, మే 31: పొగాకు.. పాడాకు. ఆరోగ్యాన్ని హాని కలిగించే ‘పాడు ఆకు’. పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కోర్టు సమావేశ మందిరంలో అవగాహన సమావేశాన్ని న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించింది. న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు, కోర్టు డ్యూటీ పోలీసులతో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సరిత ప్రతిజ్ఞ చేయించారు. ఆమె మాట్లాడుతూ.. పొగాకు వాడకంతో ఆరోగ్యం క్షీణిస్తుందని అన్నారు.

ఇల్లెందు, మే 31: పొగాకు ఉత్పత్తులకు ప్రజలు దూరంగా ఉండాలని ఇల్లెందు కోర్టు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి కోరారు. ఇల్లెందు కోర్టు అవరణలో శనివారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పొగాకుతో ఆరోగ్యం క్షీణిస్తుందని అన్నారు.

టేకులపల్లి, మే 31: పొగాకు ఉత్పత్తులకు వ్యతిరేకంగా మండలంలోని సులానగర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం ముత్యాలంపాడు క్రాస్ రోడ్డు గ్రామంలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. పొగాకు ఉత్పత్తులతో ఎలాంటి వ్యాధులు వస్తాయో, ఆరోగ్యం ఎలా క్షీణిస్తుందో వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ వివరించారు.

**పొగాకు వాడకాన్ని నిషేదిద్దాం**

మణుగూరు టౌన్, మే 31: ప్రపంచ నో టొబాకో దినోత్సవం సందర్భంగా పొగాకు వాడకాన్ని నిషేదిద్దామని మణుగూరు ప్రథమ శ్రేణి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంపాటి సూరిరెడ్డి అన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని డీవీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు, ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లతో పొగాకు వినియోగాన్ని నిషేదిద్దామని ప్రతిజ్ఞ చేయించారు.

పినపాక, మే 31: పొగాకు రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని పినపాక మెడికల్ ఆఫీసర్ డా దుర్గాభవాని అన్నారు. ఆమె పినపాక ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువత పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

# తగ్గనున్న పామాయిల్ గెలల ధర

దమ్మపేట రూరల్, మే 31: వంట నూనెల దిగుమతిపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గించింది. ఇది శనివారమే అమల్లోకి వచ్చింది. దీని ప్రభావం పామాయిల్ గెలలపై పడనుంది. జూన్ నెలలో పామాయిల్ గెలల ధర సుమారు రూ.1,000 వరకు తగ్గవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఏప్రిల్ నెలలో టన్ను గెలల ధర రూ.20,058 ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ పామాయిల్ అమ్మకాల ధర మే నెలలో స్వల్పంగా తగ్గింది. దిగుమతి సుంకం తగ్గింపు కారణంగా జూన్‌లోనూ ధర తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇదే జరిగితే ఆయిల్‌ఫెడ్‌కు, పామాయిల్ రైతులకు నష్టం వస్తుంది. అశ్వారావుపేట, అప్పారావుపేటలోగల ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీల్లో ఇప్పటికే సుమారు 4,000 మెట్రిక్ టన్నుల క్రూడ్ పామాయిల్ నిల్వలు ఉన్నట్లు సమాచారం. గడిచిన పది, పదిహేను రోజులుగా ఉత్పత్తి చేసిన క్రూడ్ పామాయిల్ కూడా నిల్వ ఉంది. ధర తగ్గితే ఆయిల్ ఫెడ్‌కు దాదాపు రూ.40 లక్షల వరకు నష్టం ఉండవచ్చని నిపుణుల అంచనా. సహజంగానే ఇది రైతులపై కూడా పడుతుంది.

**సెప్టెంబర్‌లో పెంపు... సీజన్‌లో తగ్గింపు**

గత ఏడాది సెప్టెంబర్‌లో క్రూడ్ పామాయిల్ దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని 20 శాతం వరకు విధించింది. దీని ప్రభావంతో పామాయిల్ గెలలకు అన్ సీజన్‌లో ధర పెరిగింది. సీజన్ ప్రారంభమయ్యే జూన్ నుంచి దిగుమతి సుంకం 10 శాతం తగ్గించడంతో ధర కూడా తగ్గుతుంది. ‘పామాయిల్ కార్పొరేట్ కంపెనీల వద్ద నిల్వలు దండిగా ఉన్నప్పుడు.. వాటికి ప్రయోజనం కలిగేందుకు కేంద్ర ప్రభుత్వం 20 శాతం దిగుమతి సుంకం విధించింది’ అని రైతులు ఆరోపిస్తున్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ

చండ్రుగొండ, మే 31: నిరుద్యోగ యువతకు ఉచితంగా ఉపాధి శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీసీ ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ వెంకట్రావ్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి పూర్తిచేసిన వారంతా అర్హులేనని పేర్కొన్నారు. మరింత సమాచారంతోపాటు పేర్ల నమోదుకు తనను 91776 41543 నంబర్‌లో సంప్రదించవచ్చని సూచించారు.

## 2న ప్రత్యేక సమావేశం

అశ్వారావుపేట, మే 31: రాజీవ్ వికాస్ పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ జూన్ 2న దమ్మపేట మండలం పట్వారీగూడెంలో పంపిణీ చేస్తారని ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు తమ పరిధిలోని లబ్ధిదారులతో రావాలని పేర్కొన్నారు.

# సింగరేణిని అత్యున్నతంగా తీర్చిదిద్దుతాం

**డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క**


జీఎం కార్యాలయం, ఏరియా వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

రామవరం, మే 31: సింగరేణి సంస్థను దేశంలోనే అత్యున్నత సంస్థగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలో రూ.7.66 కోట్లతో నిర్మించిన ఏరియా వర్క్‌షాప్‌ను, ఏరియా జీఎం కార్యాలయాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సంస్థ సీఎండీ బలరాం ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ... కొత్తగూడెం, ఇల్లెందు, గోలేటి ఏరియాల్లో కొత్త గనులు ప్రారంభంతో సింగరేణి లక్ష్య సాధనలో మరో అడుగు ముందుకు పడనుందని అన్నారు. సింగరేణిని తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకూ విస్తరిస్తున్నట్లు చెప్పారు. కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా పథకమనేది.. దేశవ్యాప్తంగా ఒక్క సింగరేణిలోనే ఉందని అన్నారు. సీఎండీ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎంకు సింగరేణీయుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు.

**ఓసీ ప్రభావిత ప్రజల వినతి**

మణుగూరు టౌన్, మే 31: మండలంలోని రాజుపేట, విఠల్‌రావునగర్, తిర్లాపురం కొత్త కొండాపురం గ్రామస్తులు, రైతులు మణుగూరు ఓసీ ప్రభావిత ప్రాంతాల ప్రజలు తమకు న్యాయం చేయాలని కోరుతూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి విన్నవించారు. సీపీఐ కార్యవర్గ సభ్యుడు అయోధ్య ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎంతోపాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు.

**ట్రైనింగ్ సెంటర్ సందర్శన**

పాల్వంచ రూరల్, మే 31: గిరిజన యువత శిక్షణ పొందుతున్న పాల్వంచలోని టెక్‌షోర్ ట్రైనింగ్ సెంటర్‌ను డిప్యూటీ సీఎం భట్టి సందర్శించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి చూపుతున్నట్లు సెంటర్ బాధ్యులు చెప్పారు.

## సంక్షిప్తం

### 3 నుంచి ‘భూభారతి’ సదస్సులు

బూర్గంపహాడ్, మే 31: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా మండల వ్యాప్తంగా 3నుంచి 12వ తేదీ వరకు గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ శిరీష శనివారం తెలిపారు. ఆయా పంచాయతీ కార్యాలయాలు, రైతువేదిక, ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సదస్సులు ఉంటాయని, సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

### ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

బూర్గంపహాడ్, మే 31: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పున్నం చంద్ అన్నారు. శనివారం బూర్గంపహాడ్‌లో తెలంగాణ రైతు కూలీ సంఘం, సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మండల సదస్సులో ఆయన మాట్లాడారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని, అడవుల్లో ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడానికి కేంద్రం ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు.

### ప్రతి పంచాయతీలో జెండా ఆవిష్కరణలు

మణుగూరు టౌన్, మే 31: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీ సోమవారం జిల్లాలోని ప్రతి పంచాయతీలో జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వహించాలని బీఆర్ఎస్ ఆదేశించిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు తెలిపారు. శనివారం క్యాంపు కార్యాలయం నుంచి విడుదల చేసిన ప్రకటనలో.. అన్ని పంచాయతీ కేంద్రాల్లో, మండల కేంద్రాల్లో జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు.

### పాల్వంచలో ఒకరికి కరోనా

పాల్వంచ రూరల్, మే 31 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని కేటీపీఎస్‌లో పనిచేస్తున్న ఓ కార్మికుడికి కరోనా సోకిందనే వార్త శనివారం కలకలం రేపింది. అనారోగ్య సమస్యతో ఇబ్బందిపడుతున్న అతడు పరీక్షలు చేయించుకోగా.. కరోనా సోకినట్లు తేలడంతో క్వారంటైన్‌లో ఉండాలని కేటీపీఎస్ అధికారులు సూచించినట్లు తెలిసింది. అయితే కార్మికులకు కరోనా నిర్ధారించేందుకు తమ వద్ద వైద్య సౌకర్యాలు లేవని, పరీక్షల కోసం బయటకు పంపించనున్నట్లు కేటీపీఎస్ ఉన్నత స్థాయి అధికారులు పేర్కొన్నారు.

### ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

ఆళ్ళపల్లి, మే 31: జూన్ 8 ఆదివారం ఉదయం 11 గంటలకు జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కొత్తగూడెం క్లబ్‌లో జిల్లా వ్యాప్త మాలల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శు కరకపల్లి సుధాకర్, వేమురి సత్యం పిలుపునిచ్చారు. శనివారం మాలల ఆత్మీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. జూన్ 8న జరిగే ఈ ఆత్మీయ సమ్మేళనానికి ప్రతి కుటుంబం నుంచి పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకట్రావు, నవీన్, ప్రవీణ్, నవీన్, బూషణం, చిరంజీవి, బాబు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బూర్గంపహాడ్, మే 31: మండల పరిధిలోని సారపాక 33 కేవీ లైన్ ఏర్పాటులో భాగంగా, సారపాక–1 ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు ఆదివారం అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ గుర్రం ఉపేందర్ శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

**నేడు ఇల్లెందులో..**

ఇల్లెందు, మే 31: ఇల్లెందు పట్టణంలో ఆదివారం విద్యుత్ లైన్ల ఏర్పాటు/మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

### ములకలపల్లిలో ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’

ములకలపల్లి, మే 31: ములకలపల్లి గ్రామంలో శనివారం ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమాన్ని గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించింది. రైతులకు వివిధ అంశాలను ఏడీఏ రవికుమార్, ఎంఏవో అరుణ్ బాబు, ఏఈవోలు మనోహర్, రమేష్, రాహుల్ వివరించారు.

### సర్దుబాటు జీవో సవరించాలి

ఇల్లెందు/దమ్మపేట, మే 31: ఉపాధ్యాయుల సర్దుబాటు జీవోను ప్రభుత్వం సవరించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ డిమాండ్ చేశారు. ఇల్లెందులో ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్ యూటీఎఫ్ దమ్మపేట అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావెల్లి రమేష్‌కుమార్, రాసప్రోలు ప్రసాద్ కూడా ఒక ప్రకటనలో ఇదే డిమాండ్ చేశారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాలనడం ఆశాస్త్రీయంగా ఉందని తప్పుబట్టారు. పాఠశాలల మూసివేతకు ఇది దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ‘గత సంవత్సరం నమోదైన విద్యార్థుల సంఖ్యను కాకుండా, జూన్ 30వ తేదీ నాటికి నమోదైన విద్యార్థుల సంఖ్యతో సర్దుబాటు చేసేలా ఉత్తర్వును సవరించాలి’ అని వారు డిమాండ్ చేశారు.

### ‘బెస్ట్ అవైలబుల్’కు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 31: బెస్ట్ అవైలబుల్ స్కూల్(బీఏఎస్) పథకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి అనసూర్య ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి రెసిడెన్షియల్(హాస్టల్)లో 69 సీట్లు, 1వ తరగతిలో నాన్ రెసిడెన్షియల్ (డే స్కాలర్)లో 66 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. జూన్ 16వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరిస్తామని, 20న లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని వివరించారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, మే 31: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవమూర్తులకు అర్చకులు శనివారం స్వర్ణతులసి పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. అనంతరం రామయ్యకు పట్టాభిషేక కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ జన్మదిన వేడుక


ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఇల్లెందు/పాల్వంచ/అశ్వారావుపేట, మే 31: బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ జన్మదిన వేడుకను పార్టీ నాయకులు శనివారం నిర్వహించారు. ఇల్లెందులో సీనియర్ నాయకుడు దిండిగాల రాజేందర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. యలమద్ది రవి, మహ్మద్ జాఫర్ హుస్సేన్, అబ్దుల్ నబి, గిన్నారపు రాజేష్, సాతాల హరికృష్ణ, కాసాని హరిప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. పాల్వంచలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు నివాసంలో నాయకుడు వనమా రాఘవ కేక్ కట్ చేశారు. దారా కరుణాకర్, మల్లెల రవిచంద్ర, జీవీ, కిలారు నాగేశ్వరరావు, కనగాల బాలకృష్ణ, సమ్మయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అశ్వారావుపేటలో జరిగిన వేడుకలో జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, సత్యవరపు సంపూర్ణ, తాళం సూరి, సోమాని రాజారమేష్, బుచ్చిబాబు, బాలి కిరణ్ పాల్గొన్నారు.

## పాఠశాలల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలి


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, మే 31: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో పునఃప్రారంభం నాటికి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి శరత్ ఐటీడీఏ పీవో, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు, డీటీడీవోలను ఆదేశించారు. శనివారం హైదరాబాద్ గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ సీతాలక్ష్మి, ట్రైబల్ వెల్ఫేర్ అడిషనల్ డైరెక్టర్ సర్వేశ్వరరెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, వసతిగృహాలకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రత్యేక అధికారుల ద్వారా తెప్పించి మంగళవారం నాటికి ప్రతిపాదనలు తయారుచేసి పంపుతామని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ చంద్రశేఖర్, డీఈ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో 119 శాతం బొగ్గు ఉత్పత్తి

మణుగూరు టౌన్, మే 31: సింగరేణి మణుగూరు ఏరియాకు మే నెలకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించి 119 శాతం బొగ్గు ఉత్పత్తి చేసినట్లు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. జీఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 9.88 లక్షల టన్నులకు 11.74 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించినట్లు తెలిపారు. 11,71,212 టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందని చెప్పారు. ఓవర్ బర్డెన్ తొలగింపులో 81 శాతం చేసినట్లు తెలిపారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి శ్రీనివాసచారి, ఎస్‌వోటు జీఎం శ్యాంసుందర్, ఏజీఎం వెంకట్‌రావు, శేషగిరిరావు, డీవైఎస్ఈ బీవీవీఎన్ పాత్రుడు, ఫైనాన్స్ మేనేజర్ రమేష్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సింగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## యువత తీరు మారకపోతే చర్యలు


యువకులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఐ

మణుగూరు టౌన్, మే 31: ఎక్కడైనా వివాదాల్లో పరోక్షంగా కానీ, ప్రత్యక్షంగా కానీ మీ ఇన్వాల్వెమెంట్ ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని, ఇకనైనా మీ తీరు మార్చుకోవాలని మణుగూరు సీఐ నాగబాబు రౌడీ షీటర్లకు సూచించారు. శనివారం మణుగూరు పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. మణుగూరులో రాత్రి వేళల్లో తిరుగుతున్న యువకులను, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో హెచ్చరించారు. యువత రాత్రి వేళల్లో సంచరించినా, మద్యం మత్తులో హల్చల్ చేసినా, యువత కట్టింగ్ స్టైల్, డ్రెస్ తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తల్లిదండ్రులు మీ పిల్లల ప్రవర్తన, నడవడికపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని పేర్కొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

పినపాక, మే 31: మండలంలో ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఈ బయ్యారం ఎస్సై రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఆయన శనివారం మండలంలోని ఈబయ్యారం గ్రామంలో ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి మాట్లాడారు. ఎరువుల దుకాణాల్లో విత్తనాలకు సంబంధించి స్టాక్ రిజిష్టర్లను తప్పనిసరిగా మెయింటెన్ చేయాలని, ఎప్పుడికప్పుడు విత్తనాల నిల్వలను బోర్డు పట్టికలో పెట్టాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## యోగా జీవితంలో భాగం కావాలి

కరకగూడెం, మే 31: యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని కరకగూడెం ఆయుర్వేద వైద్యాధికారి కుమారస్వామి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశాలకు యోగాసనాలు నేర్పించారు. జీవితంలో యోగాను ప్రతి ఒక్కరూ నిత్యం సాధన చేయాలని, యోగాతో మానసిక ఆందోళన తగ్గి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కవిరత్న తోటమళ్లకు ఎస్టీవో అభినందన

భద్రాచలం, మే 31: ప్రపంచ సాహితీ సదస్సుకు ఎంపిక కావడమే కాకుండా కవిరత్న జాతీయ పురస్కార్ అవార్డు పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రముఖ కవి తోటమళ్ల సురేష్‌బాబును భద్రాచలం సబ్‌ట్రెజరీ అధికారిణి తెల్లం సుభద్ర శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ ట్రెజరీ పరిధిలో తేగడ హైస్కూల్‌లో ఫిజిక్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ కవిరత్న పురస్కార్ పొంది భద్రాద్రి ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలిపారని కొనియాడారు. సీనియర్ అకౌంటెంట్లు క్రాంతికుమార్, ఎం.ఉషారాణి, రంజాన్ పాల్గొన్నారు.

## నాటు సారా పట్టివేత

టేకులపల్లి, మే 31: మండలంలోని బిల్లుడు తండా, జెండాల తండా, సీతారామపురం, ముత్యాలంపాడు, టేకులపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ ఎస్సై గౌతమ్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం దాడులు చేశారు. ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనపర్చుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

## సాంకేతికత ఆధారంగా పొగాకు సాగు

అశ్వారావుపేట, మే 31: ఆధునిక సాంకేతికతతో వర్జీనియా పొగాకును రైతులు సాగు చేయాలని ఐసీఏఆర్–ఎన్ఆర్ఐసీఏ(సీటీఆర్ఐ) డైరెక్టర్ మాగంటి శేషు మాధవ్ సూచించారు. మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో గ్యాస్ ఆధారిత బ్యారన్‌ను శనివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. గ్యాస్ ఆధారిత పుగాకు క్యూరింగ్‌తో పెట్టుబడి తగ్గడంతోపాటు నాణ్యమైన దిగుబడి వస్తుందని చెప్పారు. ఐవోసీఎల్ చీఫ్ మేనేజర్ లలిత, పుగాకు బోర్డ్ మేనేజర్ సురేఖ, ఆర్ఎం ప్రసాద్ పాల్గొన్నారు.